
# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 114 వ భాగం

## పురంజనోపాఖ్యానం; పృథు చరిత్ర -7

పృథువు యజ్ఞం అయ్యాక వెనక్కొచ్చి రాజ్యం ఏలుతున్నాడు. ధ్రువుడి సంతతి కనక పరబ్రహ్మ స్వరూపం గురించి తెలుసు. యజ్ఞం చేసే సమయంలో మహా విష్ణువు వచ్చి చెప్పాడు, కొంతకాలానికి నీ ఇంటికి సనక సనందనాదులు వస్తారు, ఆ తర్వాత నీకు మోక్షం సిద్ధిస్తుంది అని. ఈ సనక సనందనాదుల సంగతి తెల్సిందే కదా? మొదట్లో బ్రహ్మ సృష్టి ఆరంభించినప్పుడు పుట్టారు వీరు. మాకు ప్రజోత్పత్తిలో కోరికలేదు అంటూ భగవంతుడి సాన్నిధ్యం కోరుకున్నారు. ఎప్పుడూ అయిదేళ్ల పిల్లలలాగా ఉంటూ భగవంతుడి సేవలో గడిపేవారు. రామకృష్ణులు అనేది కూడా ఇదే. భగవంతుడి ముందు మన అజ్ఞానం, జ్ఞానం ఎందుకూ పనికిరావు. శరణాగతితో చిన్నపిల్లలు గా అర్థించవలసిందే. అలా వీళ్ళు నిరంతరం భగవంతుడి సేవలో ఉంటారు.

క. వినువీధినుండి మెల్లన
చనుదెంచిరి బాలసూర్య సంకాశ తనుల్
జనవినుత! సిద్ధ వర్యులు
సనకాదులు శేముషీ విచక్షణు లంతన్. [4-598]

క. అనఘాత్ము లతిథి రూపం
బున రా గృహమేధి ప్రాణములు నుద్గతిచేఁ
దనరినఁ బ్రత్యుద్గతి వం
దనముల మరలం బ్రతిష్ఠితములగు ననుచున్. [4-600]

వినువీధిలోంచి ఈ నలుగురూ వచ్చారు – పొద్దున్నే లేచే బాల సూర్యుడిలాగా ప్రకాశిస్తూ వచ్చారు. ఎవరీ సనక, సనందన, సనాతన సనత్కుమారులు? ధీరులు, ఎటువంటి కోరికలూ లేని సిద్ధులు. వీళ్ళు బ్రహ్మ మానస పుత్రులు. వైకుంఠంలోకి భగవంతుణ్ణి చూడ్డానికి వీళ్ళకి ఎటువంటి అడ్డంకీ లేదు ఏనాడూ. అలా ఓ రోజు లోపలకి వెళ్లబోతూంటే, ద్వారం దగ్గిర కాపలాగా ఉన్న జయ విజయులు అడ్డుకున్నారు. ఈ మునులకి కోపం వచ్చి వీళ్ళని మానవులై పుట్టమని శపించారనీ, వాళ్ళే హిరణ్యాక్ష హిరణ్యకశిపులుగా, రావణ కుంభకర్ణులుగా, శిశుపాల దంతవక్త్రులుగా పుట్టారని భగవతం చెప్తోంది. వీళ్ళ శాపానికి విష్ణువు కూడా ఏమీ చేయలేదు. వీళ్ళు అంతటి మహనీయులు కనక వీళ్ళొచ్చేసరికి పృథుమహారాజు అదేపనిగా నమస్కారాలు పెడుతూ వాళ్లకి అతిధ్యం ఇవ్వబోయేడు. ఎందుకంటే గొప్పవాళ్ళెవరైనా (అనఘాత్ములు) తమ ఇంటికి వస్తే ఇంటి యజమానికి (గృహమేధికి) ప్రాణాలు లేచి వస్తాయి అతిధ్యం ఇవ్వడానికి.

సీ. పూని యర్ఘ్యాసనాసీనులఁ గావించి–
కర మర్థిఁ విధివత్ప్రకారమునను
బూజించి తత్పదాంభోరుహక్షాళన–
సలిలంబు లాత్మమస్తమునఁ దాల్చి
హాటక కలిత సింహాసనాసీనులై–
విహితాగ్నులను బోలి వెలుఁగుచున్న
శర్వాగ్ర జన్ముల సనకాదులను జూచి–
యతుల శ్రద్ధాసంయమాన్వితుండుఁ [4-604]

తే. బరమ సంప్రీత మతియునై పలికె రాజు
గోరి "యో మంగళాయనులార! పూర్వ
భవమునం దెద్ది మంగళప్రద సుకర్మ
మేను జేసితి? మిముఁ జూడ నిపుడు గలిగె." [4-604.1]

వాళ్లని, బ్రహ్మ వర్చస్సుతో విహితాగ్నులలాగా వెలుగుతున్న వార్ని కూర్చోపెట్టి పూజ అదీ చేసాక చెపుతున్నాడు – ఏదో పూర్వ జన్మలో చేసుకున్న పుణ్యం వలన మిమ్మల్ని ఇక్కడ చూడగలిగాను. గమనించారా? ఇంతకుముందు విష్ణువు చెప్పాడు వీళ్ళు వస్తారు నీ ఇంటికి. ఆ, విష్ణువు చెప్పినందుకే వచ్చారు, రాక తప్పుతుందా అనుకోవటం లేదు. మీవంటి

మహనీయులు రావడానికి నాకేదో పూర్వజన్మ సుకృతం ఉండి ఉంటుంది అంటున్నాడు. అంతటి నిగర్వి కనకే భగవంతుడు చెప్పాడు వీళ్ళు వస్తారు నీ దగ్గిరకి అని. వీళ్ళు రావడం ఎందుకంటే, శిష్యుడు తయారుగా ఉన్నాడు పరమపదానికి. దానికి సిద్ధం చేయడానికి గురువు వచ్చినట్టే. ఇది రామకృష్ణుల విషయంలో కూడా చూడవచ్చు. ఆయన గురువు తోతాపురి ఆయన్ని వెదుక్కుంటూ వస్తాడు. ఆయన దీక్ష ఇస్తానంటే 'అమ్మని అడిగి వస్తా' అంటారు రామకృష్ణులు. అదీ వారి మనః స్థితి.

క. భువి నెవ్వని యెడ విప్రులు
భవుఁడును విష్ణుఁడుఁ దదీయ భక్తులును బ్రస
న్నవదను లగుదురు వానికి
భువి దివిని నసాధ్యకర్మములు లే వరయన్. [4-606]

వ. అని మఱియు "ననఘాత్ములార! లోకంబుల నీక్షించుచుం బర్యటనంబు చేయు మిమ్ము సర్వదర్శనుం డయిన యాత్మం గనుంగొనఁజాలని సర్వదృశ్యంబు చందంబున నీ లోకంబు గనుంగొనజాలకుం; డట్టి మహాత్ముల రయిన మీ దర్శనంబునం జేసి యేను ధన్యుండ నైతి; నదియునుం గాక. [4-607]

ఇంకా చెప్తున్నాడు. జీవితంలో విప్రులు, విష్ణు మహేశ్వరులు ఎవరిని కరుణిస్తారో వారికి అసాధ్యం అనేది ఉండదు కదా. నాకు అంతటి అదృష్టం కలిగింది.ప్రపంచంలో ఆత్మకి కనిపించనిదేదీ లేదు కానీ ఆ ఆత్మని ఎవరూ చూడలేకపోతున్నట్టే, అందర్నీ చూస్తూ విశ్వం అంతా పర్యటనలు చేసే మిమ్మల్ని ఎవరూ చూడలేరు. అటువంటి మిమ్మల్ని నా ఇంట్లో దర్శనం చేయగలిగాను.

చ. అరయ ధరిత్రి నెవ్వని గృహంబు మహార్హజనోపభోగ్య వి
స్ఫురిత తృణాంబు భృత్య గృహభూముల సొరెఁ దనర్చు నట్టి మం
దిరపతి పేద యైన జగతిం గడు ధన్యుఁ డటంద్రు గాన సు
స్థిరమతి మీరు వచ్చుట నశేషశుభంబుల నేను బొందెదన్. [4-608]

ఎవరి ఇంట్లో గడ్డి, నీరు, సేవకులు, భూమి అన్నీ (తృణ, అంబు, భృత్య, గృహభూముల సారెఁ) మహాత్ములకి (మహోర్హజని) ఉపయోగపడతాయో వాడు పేదవాడైనా ధన్యుడి కిందే లెక్క. అందువల్ల మీరు ఇలా రావడంతో నాకు అశేష శుభాలు ప్రాప్తిస్తాయి. అయితే ఇక్కడ పృథువు చక్రవర్తికి కావాల్సిందేమీ పెద్దగా లేదు. ముందు చెప్పినట్టూ మోక్షం ఒకటే మిగిలింది. అదీగాక ఎవరైనా మహాత్ములు వస్తే వాళ్ళని అడిగేది ఏమిటి? ఏదో ఒకరోజు పోయే సంపదలా, లేకపోతే నిరంతరం శాంతి కలిగించే, మోక్షప్రదాయకమైన భగవత్సేవా? ఏది అడగాలో తెలియకే హిరణ్యకశిపుడు భగవంతుడి చేతిలో పోయాడు కదా? అందువల్ల వీర్ని ఏమి అడుగుతున్నాడో చూడండి.

సీ. పరమ పావనులార! బాల్యంబునందుండి–
మానిత శ్రద్ధా సమన్వితులును
గుణనిధుల్ ధైర్యయుక్తులు ముముక్షువులునై–
యధిక వ్రతంబుల నాచరింతు
రట్టి పుణ్యులు భవదాగమనంబు స్వా–
గతమయ్య! సత్కృపాకలితులార!
యనివారితవ్యసనార్ణవం బయినట్టి–
భూరి దుర్లంఘ్య సంసారమందు [4-612]

తే. మతివిహీన స్వకీయ కర్మములఁ జేసి
యడరి మగ్నులమై యింద్రియార్థములనె
తివిరి పురుషార్థములుఁగాగఁ దెలియు మాకుఁ
గుశల మున్నదె లోకైక కుశలులార! [4-612.1]

వ. మీర లాత్మారాము లగుటం జేసి మీయందు గుశలాకుశల రూపంబు లయిన మతివృత్తులు సంభవింపవు గావునం; గుశలప్రశ్నం బుపపన్నంబు గాదు; కాన నేనుగృతవిశ్వాసుండనై సంతప్తు లయిన వారలకు సుహృత్తు లైన మిమ్ము నాకు నీ సంసారంబునందు నేమిట వేగంబె క్షేమంబు గలుగును యని యడిగెద; నాత్మవంతులకు నాత్మయు నాత్మభావనుండు నయిన యీశ్వరుండు భక్తానుగ్రహంబు కొఱకు నీ లోకంబున మీవంటి సిద్ధరూపంబున వర్తించుచుండు" నని పలికిన యతని గంభీరార్థ గౌరవంబులును, శుభకరంబులును, న్యాయసహితంబులును, మితాక్షరంబులును,

శ్రోత్రప్రియంబులును నయిన వచనంబులు విని సంప్రీత చేతస్కుండును, మందస్మితుండును నై సనత్కుమారుం డిట్లనియె.
[4-613]

మీరైతే పుట్టుకతోనో ముముక్షువులు. ఈ గొప్పదైన సంసారంలో చిక్కుకుని ఇంద్రియాల వెంట పరుగెట్టే మాకు పురుషార్థాలు ఏమాత్రం తెలుసో పుణ్యవ్రతాలు ఆచరించే మీకు చెప్పక్కర్లేదు. మీరెప్పుడూ ఆత్మారాములు కనక మీకు ఎటువంటి వికారాలూ కలగవు. భక్తులని అనుగ్రహించడానికి భగవంతుడే మీ రూపంలో సంచరిస్తూ ఉంటాడు. నేను సంసారంలో చిక్కుకున్నవాణ్ణి కనక ఈ సంసారంలోంచి వేగంగా ఎలా బయటపడాలి అనేది అడుగుతున్నాను. ఇలా అడిగే సరికి సనత్కుమారుడు అనే ఆయన చెప్తున్నాడు.

మ. ధరణీశోత్తమ! సర్వభూతహిత చేతస్కుండవై ధర్మ సు
స్థిర భాగ్యోదయశాలివై యెసఁగు నీచే సాధులోకోత్తరో
త్తరసంప్రశ్నము చేయఁగాఁబడె మహాత్మా! సాధులోకైక
చ్చరితంబుం దలపోయ నిట్టిద కదా; చర్చింప లోకత్రయిన్. [4-614]

తే. ధరణి సజ్జనసంగంబుదలఁపనుభయ
సమ్మతంబగువారలు సలుపునట్టి
సరససంభాషణప్రశ్నసరణి నిఖిల
జనములకు సుఖకరమగు జనవరేణ్య! [4-615]

సర్వభూతాలకి మంచి చేయడం కోసం, ధర్మం స్థాపించడం కోసమే కదా నువ్వు పుట్టినది? అటువంటి నువ్వు వేసిన ప్రశ్న లోకోత్తరమైంది. తెలిసి కూడా ఏదీ తెలియనట్టూ అడిగావు, ఇది మిగతావారికి పనికొచ్చేవిధంగా. సాధు జనుల ప్రవర్తన, సజ్జన సాంగత్యం చేసేవారి సంగతి ఇలాగే కదా ఉంటుంది?

సీ. ధరణీశ! మధునిషూదనుఁ డైనయట్టి నా-
రాయణు లలిత పాదారవింద
వరగుణ ధ్యాన ధీపరిణతత్త్వంబున-

సకలాత్మ మల విమోచనము లైన
రతియును నిత్య వైరాగ్యంబు మొదలుగా-
లోకోత్తరుఁడవైన నీకుఁగలవు;
సమ్యగ్విచార శాస్త్రములందు జనులకు-
సేమంబునకును నిశ్చితములయిన [4-617]

తే. యాత్మ వ్యతిరిక్త వస్తువులందు వీత
రాగతఁ దలంప నిర్గుణ బ్రహ్మ మయిన
యాత్మయందుల రతియును ననఁగ నివియ
హేతువులు బుద్ధిఁ జింతింప నిద్ధచరిత! [4-617.1]

మోక్ష సాధన పృధువుకి చూపించడానికి వచ్చారు కనక, దానికి దారి చూపించడానికి దీక్ష ఇచ్చేముందు చెపుతున్నారు. నారాయణుడి పాదారవిందాలలో భక్తి, జీవితంలో నిత్య వైరాగ్యం అనేవి లోకోత్తరుడివైన నీకు ముందునుండీ ఉన్నవే. నిర్గుణ బ్రహ్మం అయిన ఆత్మలో అనురక్తి ఉండాలని శాస్త్రాలు నిర్ణయించాయి. ఇలా చెప్పాక సాధనకి మరిన్ని విషయాలు చెప్తారు. అవి వచ్చే వ్యాసంలో.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS